# చిలుక పలుకులు

ఉదయం ఎనిమిది గంటలై వుంటుంది. బద్ధకంగా ఇంకా పక్కమీదే దొర్లుతున్నాను. ఇంతలోకే మాపెద్ద అమ్మాయివచ్చి 'నాన్నా! నాన్నా! అమ్మ నీళ్ళాడిందట. పిల్లా తల్లీ క్షేమంగా వున్నారట' అని పట్టలేని ఉత్సాహంతో చెప్పింది.

ఆరుగురు పిల్లల తండ్రిని ఏడవకాన్పు నాకు ఏమంత ఉత్సాహం కలిగిస్తుందని ?

మా అమ్మాయిచెప్పినవార్త మౌనంగా విన్నాను.

"పిల్లా, తల్లీ అంటే అర్థమేమిటి నాన్నా ?"

అమాంతంగా వచ్చిన ఆ ప్రశ్నకు పూర్వాపర సంబంధమేమీనాకు కనపడలేదు.

ఆలోచిస్తూ పడుకున్నాను.

"పిల్లా అంటే ఆడపిల్లా నాన్నా?"

కావచ్చు కాక పోవచ్చు. మనస్సు సందిగ్ధంలో పడింది.

"అదికాదునాన్నా. అమ్మమ్మ ఉదయంలేచీ లేవడంతోనే సంగతేమిటో కనుక్కురమ్మని, 'మదార్'ని ఆసుపత్రికి పంపించింది. ఆసుపత్రి గుమ్మంలో వాడికి తాతయ్య కనపడి, అమ్మనీళ్ళాడిందనీ, తల్లిపిల్లా క్షేమంగా వున్నారని

చెప్పాడట. పిల్ల అంటే "ఆడపిల్ల" అని అమ్మమ్మ నాతో పోట్లాడుతున్నది. కాదంటేవినదు. తమ్ముడు పుట్టాడని వాదిస్తే ఏమాత్రం వినిపించుకోదు.

"పి ల్ల అంటే ఆడపిల్లేకావచ్చు, మగపిల్లవాడైతే తాతయ్య పిల్లవాడు తల్లీ క్షేమంగా వున్నారని చెప్పేవాడు"

అనాలోచితంగా అన్న ఆ మాటలకు మా అమ్మాయి మొహం వెలవెలబారింది. దీనికి కా ర ణ మే మి టో నాకు తోచలేదు.

'నీవుకూడా అల్లానే అంటావేమినాన్నా' రుద్ధకంఠం జాలిగా పలికింది.

బిద్ధకంగా పక్కమీద దొర్లుతున్న నాకు అఘాటున మైకం వదిలింది. పొరపాటు ఏమైన జరిగి వుంటుందేమో నని భయంవేసి నా వాక్యంలోని ప్రతిమాటనీ జాగ్రత్తగా తూచడం మొదలెట్టాను. కాని ఫలితం ఏమీ కనపడలేదు.

'తాతయ్య మాటవరసకి 'పిల్లాతల్లీ' అనివుంటాడు. అంతటితో పిల్లఅంటే ఆడపిల్ల అని అనుకోవడానికి అసలు వీలులేదు" రుద్ధకంఠం కన్నీటి పొరలమధ్య ఖంగున పలికింది. నాకు మా అమ్మాయి ధోరణిలో కొంత ఇంగితం కనపడింది.

"అయితే తమ్ముడే పుట్టాడంటావా?" నమ్మిస్తూ అడిగాను.

ఇంకా సందేహం దేనికి నానా?"

మా అమ్మాయి కంఠం విజయగర్వంతో ఖంగున మోగింది.

"చెల్లెలుపుట్టడం నీకు యిష్టంలేదాతల్లీ" అనేమాటలు నాకు పెదివులదాకా వచ్చాయి, కాని ఎందుకో పెదువుల్ని నొక్కేసాను. నాకు ఆర్గురుకాదు ఏడుగురు పిల్లలు. ఆనాడు పుట్టింది అబ్బాయో, అమ్మాయో తెలియదు. ఆ సంగతి వదిలేసి మిగతా ఆర్గురు పిల్లల్లో అయిదుగురు ఆడపిల్లలు, ఒక మొగపిల్లవాడు. నాకు ఆడపిల్లలంటేనే ఎక్కువ యిష్టం.

" నాకు చెల్లాయి పుడితేనే బాగుండేది " అన్నాను అబ్బాయి పుట్టాడనే భావాన్ని బలపరుస్తూ....

"ఇంకా చెల్లాయి ఎందుకునాన్నా ! మేము అయిదుగురం వున్నది చాలదూ?"

"పుట్టిన సంతానంచాలు. కాని ఒకవేళ ఇంకా పుట్టడమే జరిగితే, నాకు ఆడపిల్లలేకావాలి" అన్నాను నా యిష్టాయిష్టాలకు అనవసరమైన ప్రాముఖ్యతయిస్తూ. 'ఆడిపిల్లలు పుడితే ఏం లాభం? ఇవ్వాళ్ళ ఇక్కడఉంటారు. రేపు అత్తవారింటికి వెళ్ళిపోతారు."

అది నిజమే....అయినా..."

"అందుకోసమే ఆడపిల్లలు పుట్టొద్దు మగపిల్లలు పుట్టాలి." మా అమ్మాయి నిశ్చయంచూచి నాకు ఆశ్చర్యం వేసింది. ఆడపిల్లలతో పోలిస్తే మగపిల్లల ఘనత ఎక్కడుందో నాకు ఎంత ఆలోచించినా ఏమీ అర్థంకాలేదు. ఏ

యింటికి వెళ్ళినా ఇంతమంది మగపిల్లలని గొప్పగా చెప్పు కుంటారు. ఆడపిల్లల్నిగూర్చి వినీ వినపడనట్లు మాట్లాడు తారు. మేము ఎన్నడూ ఆడ మగపిల్లల మధ్య ఈ పేఛ దాల్ని పాటించలేదు. ఆడ మగ తారతమ్యంలేకుండా పిల్లల్ని అందరినీ సమానంగా పెంచడం మాకుఅలవాటు. చివరకు అప్పుడప్పుడు వచ్చె బంధువులుకూడా ఈ తేడాల్ని పాటిస్తే మేముచూచి సహింపలేము.

"ఆడపిల్లలు ఎందుకు పుట్టొద్దు తల్లీ" అని మా అమ్మాయిని అడిగాను. ఆమెకు ఆ భావం ఎల్లా కలిగిందో తెలుసుకుందామనే ఉద్దేశంతో....

"ఆడబ్రతుకు చాలా హీనమైన బ్రతుకు" అని పన్నెండేడ్లు సరిగ్గా నిండని మాఅమ్మాయి, "బ్ర తు కు" "హీనం" అనే శబ్దాలకు అర్థంకూడా తెలియకుండా చిలుక పలుకులు పలికింది....

నాకు నిలుచున్న పాటున తలగొట్టి నట్టనిపించింది.

"మొగవాళ్ళదే చాలా హీనమైన బ్రతుకని" గట్టిగా నొక్కి చెప్పాను. నా మాటలు మా అమ్మాయికి అర్థంకావని తెలిసికూడా——

సాయంత్రం ఆసుపత్రికి వెళ్ళాను. నేను గుమ్మంలో కాలు పెట్టానో, లేదో "తమ్ముడు పుట్టాడు నాన్నా! తమ్ముడు పుట్టాడు నాన్నా!" అని అరుస్తో, గంతులేస్తో నాకు - పెద్ద అమ్మాయి ఎదురుపడింది. ఆమె ఉత్సాహం, సంతోషంచూచి.

మనువు, పరాశరుడు, యాజ్ఞవల్క్యుడు, నారదుడు మొద న ధర్మశాస్త్ర కర్తలందరూ జ్ఞాపకం వచ్చారు. అమాం ంగా అవమానంతో నా తలకిందికి వాలింది. తమ్ముడు పుట్టాడన్న గర్వంతో మా అమ్మాయి చేస్తున్న అల్లరి, వేస్తున్న గంతులు, స్తబ్ధంగా కళ్ళల్లో నిలిచాయి. తలదిమ్మెక్కింది.